



నిమ్మాడలో సంక్రాంతి పూజలు చేస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు

పల్లెల్లో పండగ సంబరం

- ఘనంగా సంక్రాంతి, కనుమ వేడుకలు
- అంబరాన్ని తాకిన సంబరాలు



ఏకశిలా పర్వతంపై భక్తజన సందోహం

శ్రీకాకుళం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి)

పల్లెల్లో సంక్రాంతి, కనుమ పండుగలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతిఊరు సోమవారం సంబరాలతో కళకళలాడగా.. మరుసటి రోజు మంగళవారం కనుమ నాడు ఉత్సాహానికి అవధుల్లేవాయి. పట్టణ వాసులంతా సొంతూళ్లకు క్యూ కట్టడంతో శ్రీకాకుళం నగరంలో ప్రధాన జంక్షన్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం మాత్రం నాగావళి రివర్ వ్యూ పార్క్ వద్ద జనం సందడి కనిపించింది. గ్రామీణ ప్రాంతాల్లో తమ ఇంటి దేవతకు పూజలు చేశారు. కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కనుమ అంటేనే కిక్కు. మద్యం దుకాణాల వద్ద బారులు దీరారు. మధ్యాహ్నం నుంచి ప్రతివీధిలోనూ మందు బాబుల సందడి అంతా ఇంతాకాదు. అలాగే నదీ తీరాల వద్ద, రోడ్లపై కొందరు చిందులు వేశారు. నగరంలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

భక్తజనసంద్రం ఏకశిలా పర్వతం

జి.సిగడాం, జనవరి 16: మెట్టవలస ఏకశిలాపర్వతం భక్తజన సంద్రంగా మారింది. సోమవారం సంక్రాంతి నాడు యాత్ర మహోత్సవాలకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. భక్తుల వినోదార్థం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మందుగుండును కాల్చారు.

కిటకిటలాడిన పద్మనాభుని కొండ..

జలుమూరు, జనవరి 16: శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్ర4పాలకుడు విష్ణుమూర్తి కొలువు తీరిన పద్మనాభుని కొండ మంగళవారం భక్తులతో కిటకిట లాడింది. కనుమ పురస్కరించుకుని కొండపై కృష్ణార్జులను భక్తులు దర్శించుకున్నారు. జలుమూరుతో పాటు సారవకోట, ఎల్ఎన్ పేట, హిరమండలం నుంచి బారీగా తరలి వచ్చారు. ప్రతీ ఏటా కనుమ నాడు పద్మనాభుని జాతర నిర్వహించడం ఆనవాయితీ.



పద్మనాభుని కొండపైకి వెళ్తున్న భక్తులు

సంక్రాంతి పూజల్లో అచ్చెన్నాయుడు

టెక్కలి/కోటబొమ్మాళి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కుటుంబసభ్యులతో కలిసి సోమవారం నిమ్మాడలో సంక్రాంతి పూజల్లో పాల్గొన్నారు. మంగళవారం కనుమ సందర్భంగా అచ్చెన్నాయుడు తన సతీమణి విజయమాధవితో కలిసి గోపూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు, సన్నిహితులు, కుటుంబసభ్యులతో కలిసి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కింజరాపు ప్రభాకర్, కోటబొమ్మాళి మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్ తదితరులున్నారు.

బోసిపోయిన నగరం

శ్రీకాకుళం క్రైం: సంక్రాంతి సందర్భంగా నగరంలోని ప్రజలు పల్లెబాట పట్టడంతో శ్రీకాకుళం రోడ్లు బోసిపోయాయి. నిన్న మొన్నటి వరకు రోజంతా రద్దీగా ఉన్న పొట్టి శ్రీరాములు మార్కెట్, జీటీ రోడ్డు, కళింగరోడ్డు, పాలకొండ రోడ్డు, డేఅండ్ నైట్ రోడ్లు మంగళవారం ఖాళీగా దర్శనమిచ్చాయి.



డే అండ్ నైట్ కూడలిలో ఖాళీగా దర్శనమిచ్చిన రోడ్లు

అక్కడ కనుమనాడే భోగి..



కోసమాళ దేవాంగుల వీధిలో కనమరోజే భోగి మంటలు

మెళియాపుట్టి, జనవరి 16: ఆ గ్రామంలో ఓవీధిఅంతా చేనేత కార్మికులులే. ప్రతిఏటా పండగ నెల రోజుల ముందునుంచే రాత్రి, పగలు దుస్తులు నేసి గ్రామాల్లో తిరుగుతూ అమ్ముతుంటారు. దీంతో వీరి పూర్వీకుల నుంచి కనుమ రోజే భోగి చేస్తున్నారు. ఇప్పటివరకు అది ఆనవాయితీగా వస్తోంది. కోసమాళ గ్రామంలోని దేవాంగుల వీధిలో మంగళవారం భోగి మంటలు వేసుకున్నారు. అందరూ కనుమ జరుపుకుంటుంటే వారు మాత్రం భోగి వేడుక చేసుకున్నారు.



సహస్ర దీపాలంకరణ..

పాతపట్నం, జనవరి 16: షిరిడీగిరిపైన సాయినాధుడి మందిరంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా సహస్ర దీపాలకంరణ చేశారు. సుదూరప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

ఘనంగా భద్రమంహకాళి తల్లి జాతర..

రణస్థలం, జనవరి 16: ఉత్తరాంధ్ర ఇలవేల్పు భద్రమంహకాళితల్లి జాతర కనుమ రోజు ఘనంగా జరిగింది. కోటపాలెం గ్రామానికి సమీపాన భద్రమంహకాళి జాతర ప్రతి ఏటా మకరసంక్రాంతి, కనుము, ముక్కనుమ రోజుల్లో ఈ జాతర జరుగుతుంది. మంగళవారం అమ్మవారికి మొక్కులు తీర్చేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తు లేకపోవడంతో ట్రాఫిక్ స్తంభించి భక్తులు ఇబ్బంది పడ్డారు.



భద్రమంహకాళితల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు

వేడుకగా సామూహిక మేళా..

ఇచ్ఛాపురం, జనవరి 16: బెల్లుపడ గ్రామం శివానందగిరి కొండపై త్రినాధస్వామి ఆలయంలో సామూహిక మేళా వేడుకగా జరిగింది. 108 మంది మహిళలు మేళాలో పాల్గొన్నారు. కనుమ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.



మేళాలో పాల్గొన్న మహిళలు

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

ఎండీయూ వాహనంలో వైసీపీ నేత ధాన్యం తరలింపు!

మందస, జనవరి 16: మందస మండలం పాతకోట గ్రామంలో ధాన్యం బస్తాలు తరలిస్తున్న ఎండీయూ వాహనం విద్యుదాఘాతానికి గురై కాలిపోయింది. పరిసర ప్రాంతంలో ఉన్న వరిగడ్డి సైతం ఆహుతి అయింది. గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు కొద్దిరోజులు రేషన్ పంపిణీ వాహనాన్ని సొంత అవసరాలకు వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో సోమవారం సాయంత్రం పొలంలోని ధాన్యం బస్తాలు తెచ్చేందుకు వాహనాన్ని తీసుకెళ్లారు. అధిక బరువు వేయడంతో వాహనంలో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను నియంత్రించేందుకు యత్నించినా అప్పటికే వాహనం కాలిపోయింది. రేషన్ వాహనాన్ని ఇతర అవసరాలకు వినియోగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ బి.పాపారావును వివరణ కోరగా ఎండీయూ వాహనం కాలిపోయిందని ఫిర్యాదు అందిందన్నారు. సివిల్ సప్లై డీటీ రవి, ఆర్ఐ సవర చిన్నారావును విచారణ చేపట్టాలని ఆదేశించామన్నారు. నివేదికను బట్టి తదుపరి చర్యలుంటాయన్నారు.



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై కాలిపోయిన రేషన్ సరఫరా వాహనం


పండగరోజు అంగన్వాడీల పస్తు

సరుబుజ్జిలి: హిందువుల పండగలో అతి ముఖ్యమైన సంక్రాంతి నాడు అంగన్వాడీ సిబ్బంది పస్తులుండి ప్రభుత్వం వైఖరిపై నిరసన తెలిపారు. సోమవారం సరుబుజ్జిలి మండల అంగన్వాడీల సంఘం అధ్యక్షురాలు కూన జ్యోతి ఆధ్వర్యంలో గోనెపాడు గ్రామంలో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఖాళీ విస్తరాకులతో నిరసన తెలిపారు.



ఖాళీ విస్తరాకులతో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుతున్నామని సర్కారు గొప్పలు చెబుతోంది. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జిల్లాలో నాడు-నేడు రెండో విడత పనులకు నిధులు కేటాయించడం లేదు. సొంతంగా పెట్టుబడి పెట్టి చేసిన పనులకు చెల్లింపులు సైతం చేయడం లేదు. దీంతో పాటు నిర్మాణ సామగ్రిని అందివ్వడంలో ప్రభుత్వం తీవ్ర తాత్సారం చేస్తోంది. ఈ ఏడాది జూన్ నాటికే పనులు పూర్తికావాల్సి ఉన్నా చాలా పాఠశాలల భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తోన్నాయి. పనులు చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నా క్షేత్రస్థాయిలో నిధులు, సిమెంటు, ఇసుక, మానవ వనరుల కొరతతో చాలాచోట్ల పనులు నిలిచిపోయాయి. దీంతో తరగతి గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



- మేజర్ పంచాయతీ హిరమండలంలోని పెద్దకోరాడ ప్రాథమిక పాఠశాల ఇది. మరమ్మతులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి 2022-23లో నాడు-నేడు రెండో విడత కింద రూ.12 లక్షలు మంజూరు చేశారు. శ్లాబ్ స్థాయి వరకు పనులు పూర్తయ్యాయి. బిల్లు బకాయిలు చెల్లించకపోవడం, కిటికీలు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో గత కొన్ని నెలలుగా పనులు నిలిచిపోయాయి. దీంతో తరగతులు నిర్వహించేందుకు వీలులేకుండా పోయింది. దీంతో అర కిలో మీటరు దూరంలో ఉన్న సచివాలయం-2 భవనంలో విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. అంత దూరం వెళ్లడానికి వారు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయానికి వచ్చిపోయే వారు ఎక్కువగా ఉండడంతో తరగతుల నిర్వహణకు ఇబ్బందిగా మారింది. ఈ గదిలో సచివాలయ సామగ్రి ఉండడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురౌతున్నారు. ఏడాది కాలంగా ఇదే పరిస్థితి నెలకొంది.



- ఇది మెళియాపుట్టి మండలం జాడుపల్లి జిల్లాపరిషత్ పాఠశాల. కొత్త భవనం నిర్మిస్తామని చెప్పి పిల్లర్ల కోసం ఇనుప చువ్వలు ఏర్పాటు చేసి మధ్యలో వదిలేశారు. ఈ పాఠశాలలో 130 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాడు-నేడు రెండో విడత కింద గతేడాది ఈ పాఠశాలను ఎంపిక చేశారు. రూ.1.27 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు. గత వేసవి సెలవులు నాటికే ఈ పనులు పూర్తికావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు చేసిన పనులకు రూ.26.46 లక్షల బిల్లులు మాత్రమే విడుదలయ్యాయి. మిగతావి మంజూరు కాకపోవడంతో పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. మరో రెండు నెలల్లో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో పనులు పూర్తిపై సందేహాలు నెలకొన్నాయి. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



- వరండాలో చదువులు సాగిస్తున్న ఈ విద్యార్థులు మెళియాపుట్టి మండలం కోసమాళ జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన వారు. ఈ పాఠశాలలో 343 మంది విద్యార్థులు ఉన్నారు. నాడు-నేడు రెండో విడతలో ఈ పాఠశాలను ఎంపిక చేశారు. అభివృద్ధి పనులకు రూ.69 లక్షలు కేటాయించారు. ఈ ఏడాది జూన్ నాటికే పనులు పూర్తికావలసి ఉంది. కానీ ఇప్పటికీ మొండి గోడలే కనిపిస్తున్నాయి. చేసిన పనులకు కేవలం రూ.26.63 లక్షల బిల్లులు మాత్రమే అందాయి. మిగతా బిల్లులు రాకపోవడంతో తరగతి గదుల పనులు పూర్తికాక వరండాల్లో విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు.

నాడూ-నేడూ.. అదే గోడూ

- రెండో విడత పనులకు నిధుల కొరత
- అసంపూర్తిగా భవన నిర్మాణాలు
- విద్యార్థుల తీవ్ర అవస్థలు
- బిల్లుల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని ప్రభుత్వం

(మెళియాపుట్టి/హిరమండలం)

జిల్లాలో నాడు-నేడు పథకం కింద మొదటి విడతలో 1,247 పాఠశాలలను ఎంపిక చేసి పనుల కోసం రూ.289.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. రెండో విడతలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి 1096 భవనాల నిర్మాణానికి రూ.427.73 కోట్లు అంచనాలు వేశారు. అయితే నిధులు సకాలంలో మంజూరు కాకపోవడంతో విద్యాకమిటీ ఛైర్మన్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సొంతంగా పెట్టుబడి పెట్టి పనులు చేశారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు చెబుతున్నారు. అప్పు చేసి పనులు చేపట్టామని, ఇప్పుడు బిల్లులు రాకపోవడంతో వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరండాల్లో తరగతులు..

నూతన భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో సరిపడ తరగతి గదులు లేక చెట్ల కింద, వరండాల్లో చదువులు సాగిస్తున్నారు. మరికొన్ని చోట్ల సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా వేరొక చోట తయారు చేసి తీసుకువచ్చి వడ్డిస్తున్నారు. ఇల్లు పీకి పందిరేసిన చందగా ఉన్న భవనాలను మరమ్మతుల పేరుతో నాశనం చేశారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు పనులు జరుగుతున్నాయో లేదో కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. గత కొన్ని నెలల నుంచి నాడు-నేడు పనులపై సమీక్షలు సైతం నిర్వహించడం లేదు.



జాడుపల్లి జడ్పీ పాఠశాల ఆవరణలో రాయి,ఇటుకలు వేసి వదిలేసిన దృశ్యం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

నాడు-నేడు పనుల పెండింగ్ బిల్లుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా. బిల్లుల చెల్లింపు మేరకు కొన్నిచోట్ల పాఠశాలల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. గతకొన్ని నెలలుగా బిల్లులు ఆగిపోయాయి.

-దేవేంద్రరావు, ఎంఈవో, మెళియాపుట్టి

సంక్రాంతి సందడే సందడి

- నృత్యాలతో అలరించిన గిరిజన కళాకారులు
- పేదలకు వస్త్రాలు, నిత్యావసరాల పంపిణీ
- కోలాహలంగా సముద్ర తీర ప్రాంతాలు

గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల నడు మ సోమవారం నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పాటు ఆయా గ్రామాల ప్రజలు వివిధ కార్యక్రమాలతో సందడి చేశారు. అలాగే గిరిజన కళాకారులు వివిధ రకాల వాయిద్యాలను వాయిస్తూ నృత్యాలు చేశారు. అలాగే కనుమ రోజున మంగళవారం పశువులకు ప్రత్యేక పూజలు చేసి వంటకాలు సమర్పించారు. మాంసం కొనుగోలుతో దుకాణాలు కిటకిట లాడాయి. అలాగే పలువురు గ్రామస్థులు నిరు పేదలకు నూతన వస్త్రాలు, బియ్యం, బెల్లం తదితర నిత్యావసర వస్తువులను పంపిణీ చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వివిధ గ్రామాల్లోని సముద్ర తీరాలు పర్యాటకులతో కిట కిటలాడాయి.

-ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడులో గొబ్బెమ్మల వద్ద పూజ చేస్తున్న మహిళలు


ఇచ్ఛాపురం: బెల్లుపడ శివానంద కొండపై గాలిపటాల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు


జి.సిగడాం: పెద్దలను కీర్తిస్తున్న జంగమయ్య


పలాసరూరల్: రెంటికోట కాలనీలో వాయిద్యాలతో..


పోలాకి: సంతలక్ష్మీపురంలో ఉట్టి కొడుతున్న యువకులు


నరసన్నపేట: కళింగ కోమట్ల సంఘం సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న మహిళలు


నందిగా: చిన్నలక్ష్మీపురంలో మెయ్యి గుర్రం ప్రదర్శన


చిన్నలవునిపల్లిలో కట్రీఫ్ ఆట ఆడుతున్న చిన్నారులు



సంతబొమ్మాళి: దేపల్లివానిపేట, వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి శివసాగర్ సముద్ర తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు


ఇచ్ఛాపురంలో మాంసం కోసం..

గోపూజ సకల దేవతారాధనతో సమానం

శ్రీకాకుళం క్రైం/అరసవల్లి: గోమాతను పూజిస్తే సనల దేవతలను ఆరాధించినట్లేనని అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ అన్నారు. కనుమ సందర్భంగా ఆలయంలోని గోశాలలో మంగళవారం గోపూజ నిర్వహించారు. గోమాత హిందూ ధర్మ ప్రతీక అని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో చక్రవర్తి, అర్చకులు ధర్భముళ్ల శ్రీనివాసరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


అరసవల్లిలో గోవులకు పూజ చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ

ఊడికలపాడులో...

కోటబొమ్మాళి: సంక్రాంతి పండగలో భాగంగా మూడో రోజైన కనుమ నాడు గోపూజ చేయడం ద్వారా పవిత్రత చేకూరుతుందని కోటబొమ్మాళికి చెందిన ప్రముఖ వేద పండితుడు నుసరాపు చంద్రశేఖర శర్మ అన్నారు. ఊడికలపాడు శ్రీరామమందిర ప్రాంగణంలో మంగళవారం గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. హిందువులకు అత్యంత పూజనీయమైన గో మాతలను ఇళ్లలో పెంచడం ద్వారా ఆ ఇల్లు, ఆ గ్రామం సుఖ సంతోషాలతో తులతూగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు, శ్రీరామమందిరం సభ్యులు సనపల కరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి గోకులంలో...

పలాసరూరల్: పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి గోకులంలో కనుమ పండుగ మంగళ వారం నాడు గోపూజ నిర్వహించారు. 23 గోవులకు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి నూతన వస్త్రాలు, ప్రసా దాలు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నగరంపల్లిలో...

వజ్రపుకొత్తూరు: గోవులను పూజించడం మన సంప్రదాయమని డాక్టర్ బీఆర్ఏయూ పూర్వ వీసీ, ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. కనుమ పండగను పురస్కరించుకుని మంగళవారం నగరంపల్లి లక్ష్మీనారాయణ ఆలయంలో మాజీ సర్పంచ్ దువ్వాడ వెంకట కుమార్ చౌదరి ఆధ్వర్యంలో గోపూజా కార్యక్రమం నిర్వహించారు. గో పూజ, గో రక్షణ అంశాలలో నేటి యువత సంప్రదాయాలను పాటించాలని కోరారు. గోసేవను అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దువ్వాడ లక్ష్మి, జయరాం చౌదరి, అప్పారావు, సనపల చక్రవర్తి, దువ్వాడ ఉమామహేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

వీరన్నాయుడు కాలనీలో...

నరసన్నపేట: హైందవ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హిందూ ధర్మ పరిషత్ సభ్యులు నేతింటి సింహాచలం అన్నారు. కనుమ సందర్భంగా మంగళవారం వీరన్నాయుడు కాలనీలో గో పూజను ఆయన ప్రారంభించారు. గోవులను పూజించడం హిందూ సంప్రదాయమన్నారు. పాడి సంపదను పెంచాల న్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, సాసుపల్లి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు. దేశ వానిపేట, కోమర్తి గ్రామాల్లో గోపూజను నిర్వహించిన సహపంక్తి భోజనాలను చేశారు.

కల్యాణ తిరుమల క్షేత్రంలో...

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కలెక్టర్ బంగ్లా సమీపంలోని కల్యాణ తిరుమల క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో మంగళవారం గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు లోకనాథం నందికేశ్వర రావు, అధ్యక్ష, కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద జగన్నాథాలయంలో...

ఇచ్ఛాపురం: కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్ద జగన్నాథ స్వామి ఆలయంలో మంగళవారం సామూహిక గోపూజలు నిర్వహించారు. పూజలు చేసి పండ్లు, కూరగాయలు, కొత్త ధాన్యం, కొత్త బియ్యం, బెల్లం ఆవులకు ఆహారంగా అందించారు. కార్యక్ర మంలో అర్చకులు ఎస్‌పి రామప్రసాద్ సిద్ధాంతి, పద్మకుమార్ ఆచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కాళ్ల శ్రీనివాస్, ప్రకాష్, వెంకటరావు, మహిళలు పాల్గొన్నారు.


శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా సమీపంలోని కల్యాణ వేంకటేశ్వరాలయంలో గోపూజ


ఇచ్ఛాపురం: పెద్ద జగన్నాథాలయంలో గోవులకు పూజలు చేస్తున్న భక్తులు


కోటబొమ్మాళి: ఊడికలపాడులో...


నరసన్నపేట: వీరన్నాయుడు కాలనీలో..


పలాసరూరల్: సత్యసాయి గోకులంలో...


వజ్రపుకొత్తూరు: గోపూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ లజపతిరాయ్

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం

టెక్కలి: నర్సింగపల్లి పంచాయతీకి చెంది ఉద్యోగ విరమణ చేసిన వారికి మంగళవారం నర్సింగపల్లి సేవా సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. గ్రామాభివృద్ధికి విశ్రాంత ఉద్యోగులు తోడ్పాటును అందించాలని సేవా సంఘం ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌతు జయ మోహన్, మాజీ సర్పంచ్ పోలాకి షన్ముఖరావు, డీసీసీబీ మేనేజర్ ఇప్పిలి సీతారాం, ప్రతినిధులు ఎన్ని షన్ముఖరావు, ఇప్పిలి గణపతిరావు, కొండవీటి శ్రీను, దారపు రామకృష్ణ, ధర్మారావు, పెదరెట్టి మణి, దారపు జోగారావు, రట్టి ఆదినారాయణ పాల్గొన్నారు.


సత్కారం పొందిన విశ్రాంత ఉద్యోగులు

మాజీ సైనికులకు...

జలుమూరు: శ్రీముఖలింగం ఆలయం ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో మాజీ సైనికులను మంగళవారం ఘనంగా సత్కరించారు. గ్రామంలోని చేయూత సంస్థ ప్రతినిధులు, గ్రామస్థులు కలిసి 8 మంది మాజీ సైనికులను పూలమాల, దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులచే జానపద నృత్యాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కరుకోల హరిప్రసాదరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


మాజీ సైనికులను సత్కరించిన సర్పంచ్, ఎంపీటీసీ

గీతామందిరంలో పసుపు, కుంకుమ పంపిణీ

టెక్కలి: స్థానిక కొండ్రవీధి గీతా మందిరంలో కమల గణపతి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు పసుపు కుంకుమ మంగళవారం పంపిణీ చేశారు. సేవా సమితి వ్యవస్థాపకులు జామి వెంకటేశ్వరరావు, మాధవీలత ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాస పూజల్లో పాల్గొన్న మహిళలు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో తంగుడు లక్ష్మి, మోనింగి కల్పన, పట్నాన అరుణ, జామి మాధవి తదితరులు పాల్గొన్నారు.


పసుపు, కుంకుమ పంపిణీ దృశ్యం

అంబేడ్కర్ యువజన సంఘం శ్రమదానం

ఎస్సీకాలనీ(పోలాకి): ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు మంగళవారం శ్రమదానం చేసి చెత్తా చెదారాలను తొలగించారు. పంచాయతీ పాలకులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించక పోవడంతో కనుము పండుగ సందర్భంగా అందరూ సమష్టిగా పారిశుధ్య పనులను చేపట్టారు. కార్యక్ర మంలో సంఘం ప్రతినిధులు చిన్నప్పన్న, కసవయ్య, ఎర్రంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


చెత్తను తొలగిస్తున్న యువకులు

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

మెళియాపుట్టి: గిరిజన గ్రామాల్లో తాగు నీటి సమస్యలను తీర్చాల్సిన బాధ్యత ప్రజా ప్రతి నిధులపై ఉందని పాలకొండ తహసీల్దార్ బి. సోమేశ్వరరావు అన్నారు. స్వగ్రామం బగడలో తాగునీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. మూరుమూల గ్రామాల్లో కొండలపై ఉన్న ఊట నీరు కలుషితం అవడం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. స్వచ్ఛమైన నీటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



మంచు ధాటికి అపరాలకు దెబ్బ

పలాసరూరల్: ఈ ఏడాది వర్షాభావంతో ఖరీఫ్ సీజన్‌లో పంటలను నష్టపోయిన రైతులకు ప్రస్తుతం గడచిన వారం రోజులుగా కురుస్తున్న పొగ మంచుతో అపరాల పంటలకు నష్టం వాటిల్లుతోంది. మండ లంలో మినుము, పెసర, రాగులు తక్కువగా వేయగా, తెట్టంగి పంటను వివిధ ప్రాంతాల్లో అపరాల సాగులో వేశారు. ముఖ్యంగా గిరిజన, మైదాన ప్రాంతాల్లో వీటిపై రైతులు ఆధార పడగా, వారం రోజులుగా ఉదయం 9, 10 గంటల వరకు మంచు తగ్గడం లేదని, దీంతో అపరాల పంటలపై ఆశలు వదులుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఉల్లాసంగా బల ప్రదర్శన పోటీలు

జలుమూరు: కరవంజ గ్రామంలో విశ్వేశ్వరస్వామి 4వ వార్షికోత్సవం పురస్కరించుకొని సంక్రాంతి సందర్భంగా సోమవారం జిల్లా స్థాయి బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నిమ్మాడకు చెందిఆవల గోవిందరావు ప్రథమ, తంగివానిపేటకు చెందిన ముద్దాడ తరుణ్, ద్వితీయ, పొందూరుకు చెందిన షేక్ రజాక్ తృతీయ స్థానం సాధించారు. అలాగే మహిళల విభాగంలో కోర్లకోటకు చెందిన రాజ్యలక్ష్మి ప్రథమస్థానం సాధించింది. సంగిడీలు ఎత్తుడు, విసురుడు గుండు పోటీల విజేతలకు ప్రముఖ క్రీడాకారిణి పూజారి శైలజ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జుత్తు నేతాజీ, మాజీ సర్పంచ్ జుత్తు అప్పలనాయుడు, కమిటీ సభ్యులు సంపతిరావు శ్రీరాములు, చింతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ● **నందిగాం:** బడగాం, చిన్నలవునిపల్లి గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా వివిధ రకాలు పోటీలను స్థానిక యువజన సంఘాలు, గ్రామస్థులు నిర్వహించారు. రంగవల్లికలు, మ్యూజిక్‌చైర్, కట్రీఫ్, టగాఫ్‌వార్ తదితర ఆటల పోటీలను నిర్వహించి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. బడగాంలో సర్పంచ్ కూన శాంతారావు బహుమతులు అందించారు. సంప్రదాయాలను కొనసాగించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నల వునిపల్లిలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. అలాగే మరికొన్ని గ్రామాల్లో కబడ్డీ, క్రికెట్ వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ● **పలాస రూరల్:** పలాస మండలం సున్నాదేవి గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకొని వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గార చంద్రయ్య, గర్తం సావిత్రి, గర్తం శంకరరావు పాల్గొన్నారు.


వెయిట్‌లిఫ్టింగ్ మహిళా విభాగంలో ప్రథమ బహుమతి విజేత రాజ్యలక్ష్మి


నందిగాం: బడగాంలో టగాఫ్‌వార్ ఆడుతున్న యువకులు


పలాసరూరల్: సున్నాదేవిలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

'హనుమాన్' సినిమా గీత రచయితకు సత్కారం

నరసన్నపేట: ఇటీవల విడుదలైన హనుమాన్ చిత్రంలో 'ఆవకాయి ఆంజనేయ' అనే గీతాన్ని రచించిన బొరిగివలస గ్రామానికి చెందిన సినీ గేయ రచయిత మన్నెల సింహాచలాన్ని గ్రామస్థులు మంగళవారం సత్కరించారు. ఉత్తరాంధ్ర సాహిత్యాన్ని మరింత ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. మరో మూడు సినిమాలకు పాటలు రాసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు తంగి తారకేశ్వరావు, గ్రామ యువత పాల్గొన్నారు.


సింహాచలాన్ని సత్కరిస్తున్న గ్రామస్థులు

మిత్రుల జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నమెంట్

వజ్రపుకొత్తూరు: పెదవంక-బాతుపురం గ్రామాల్లో చెల్లూరు గోపాలరావు, ఇరోతునాగ జ్ఞాపకార్థం వారి మిత్రులు వాలీబాల్ టోర్నమెంట్‌ను సోమవారం నిర్వహించగా ఈ పోటీలకు సర్పంచ్ బత్తిని లక్ష్మీనారా యణ ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందించారు.

రేపటి నుంచి జీపీడీపీ శిక్షణ

సంతబొమ్మాళి: ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 17, 18వ తేదీల్లో రెండు రోజుల పాటు జీపీడీపీ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమా సుందరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కు సర్పంచ్‌లు, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సీఎఫ్‌లు, ఆశ కార్యకర్తలు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దీర్ఘాశి(పోలాకి): పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మెండ రామకృష్ణ, శిమ్మన్న ఒక ప్రకటనలో తెలిపారు. 2013 సంవత్సరంలో దీర్ఘాశి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ హాజరు కావాలని కోరారు.

అ'పూర్వ'కలయిక

మెళియాపుట్టి: మెళియాపుట్టి ఉన్నత పాఠశాలలో 2008-2009లో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం పాఠశాల ఆవరణలో కలుసుకుని ఆనందం పొందారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఒకరికొకరు అభినందించుకున్నారు. నేటి స్థితిగతులను చెప్పుకున్నారు. అందరూ కలిసి పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని నిర్ణయించారు. 15 ఏళ్ల తరువాత ఒకేచోట కలుసుకోవడం ఆనందంగా ఉందని వారు పేర్కొ న్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రదీప్‌కుమార్, హరిప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

బుడితిలో...

జలుమూరు: బుడితి ఉన్నత పాఠశాలలో 30 ఏళ్ల కిందట చదువుకున్న విద్యార్థులంతా ఒకచోట చేరారు. నాటి జ్ఞాపకలను నెమరు వేసుకుంటూ ఆనందం పొందారు. 1992-93 బ్యాచ్‌కి చెందిన 10వ తరగతి విద్యార్థులు కలిసి నాటి మధుర స్మృతులు నెమరు వేసుకున్నారు. నాడు చదువుకు చెప్పిన 13 మంది ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు.


మెళియాపుట్టి 2008-2009 నాటి విద్యార్థులు


బుడితి ఉన్నత పాఠశాలలో నాటి ఉపాధ్యాయులతో 1992-93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన


టెక్కలిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

టెక్కలి రూరల్/పొందూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది చేపట్టిన నిరసన మంగళవారం కూడా కొనసాగింది. టెక్కలి, పొందూరు మండలాల్లో దీక్షను కనుమ పండుగ రోజున కూడా నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం మండలాల అంగన్‌వాడీ సిబ్బంది ప్రభుత్వ విధానాలకు నిరసిస్తూ వృత్తాకారంలో తిరుగుతూ నినాదాలు చేశారు. గోరింటలో సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు సంఘీభావం తెలిపారు.


పొందూరు: గోరింటలో సంతకాలు సేకరిస్తూ..

పూరీ యాత్ర ముగించుకుని వెళ్తుండగా..

- నెమలినారాయణపురం వద్ద రెండు టూరిస్టు బస్సులు ఢీ
- ఒకరి మృతి, ఏడుగురికి గాయాలు

పలాస: పూరీ యాత్ర ముగించుకుని అన్నవరం దైవదర్శనం కోసం వెళ్తుండగా సోమవారం ఉదయం నెమలినారాయణపురం వద్ద రెండు టూరిస్ట్ బస్సులు ఢీకొనడంతో సహాయకడ్రైవర్ దినేష్‌నిషాద్(26) ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మరో ఏడుగురు యాత్రికులు స్వల్పగాయాలతో ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన 104 మంది రెండు టూరిస్టు బస్సుల్లో పూరి నుంచి అన్నవరం దైవదర్శనం కోసం వెళ్తున్నారు. పలాస జాతీయరహదారి నెమలినారాయణపురం వద్ద ఇందులో ఓ టూరిస్ట్ బస్సుడ్రైవర్ ఐదు గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లడంకోసం బస్సును రోడ్డు పక్కకు తిప్పాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో బస్సు డ్రైవర్ దీన్ని గుర్తించలేదు. ఎదురుగా ఆపేందుకు ప్రయత్నిస్తున్న ఆ బస్సును బలంగా ఢీకొట్టాడు. దీంతో తాత్కాలికంగా బస్సు డ్రైవర్‌గా వ్యవహరిస్తున్న మరో డ్రైవర్ దినేష్‌నిషాద్ క్యాబిన్‌లో చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనతోపాటు మరో ఏడుగురు గాయపడ డంతో 108, హైవే అంబులెన్స్ సిబ్బంది వెంటనే పలాస ప్రభుత్వాసుపత్రికి క్షతగాత్రులను తరలించగా, చికిత్సపొందుతూ డ్రైవరు మృతిచెందాడు.ఆ సమయంలో రెండు బస్సుల్లో 104 మంది యాత్రికులు ఉన్నారు. సంఘటన స్థలానికి కాశీబుగ్గ పోలీసులు చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ట్రావెల్ బస్సు యాజమాన్యం మరో బస్సును ఏర్పాటుచేసి యాత్రికులను స్వస్థలాలకు తరలించారు. కాగా యాత్రికులకు స్థానిక సత్యసాయిమందిర నిర్వాహకులు మల్లా రామేశ్వరరావు, శరత్, శ్రీనివాస్‌లతో కూడిన బృందం వారికి అల్పాహారం, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా పండగంటి పూట ప్రమాదం జరగడంతో యాత్రీకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

తేలుకుంచిలో మహిళ ఆత్మహత్య

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచిలో సోమవారం మల్లవరపు వెంకటలక్ష్మి(30) ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు, రూరల్ ఎస్ఐ రమేష్ కథనం మేరకు.. తేలుకుంచి గ్రామానికి చెందిన వ్యక్తితో 11 ఏళ్ల కిందట వెంకటలక్ష్మి ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు ఆడపిల్లల శరణ్య(9), లిఖిత(7) ఉన్నారు. గతంలో భర్తతో మనస్పర్థలు రావడంతో విడిపోయింది. ఇటీవల కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన వెంకటలక్ష్మి సోమవారం సంక్రాంతి రోజున ఇంట్లో ఓ ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంకట లక్ష్మి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై భార్య ఫిర్యాదు

ఎచ్చెర్ల: సినిమా చూసి వస్తానని చెప్పి ఈనెల 13న బయటకు వెళ్లిన తన భర్త ఇంటికి చేరలేదని భార్య మంగళవారం ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసింది. మండలంలోని కేశవరావుపేట గ్రామానికి చెందిన గజ్జి రాజు (33, మూగవాడు) సినిమాకు వెళ్తానని చెప్పి బయటకువెళ్లాడు. ఈ మేరకు తిరిగి ఇంటికి రాలేదని భార్య అన్నపూర్ణ ఫిర్యాదుచేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. వివరాలు తెలిస్తే ఫోన్ నెంబర్లకు 63099 90853, 9494776691కు తెలియజేయాలని కోరారు.

శబరిమలలో జిల్లా వాసి...

శ్రీకాకుళం క్రైం: ఎచ్చెర్ల మండలంలోని కొంగరాం గ్రామానికి చెందిన గుండ ఈశ్వరుడు(75) అదృశ్యమైనట్లు మంగళవారం కేరళాలోని పంబ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల 12న శబరిమల వెళ్లిన ఈశ్వరుడు తిరిగి ఇంటికిరాలేదు. దీంతోఆచూకీకోసం కుటుంబ సభ్యులు ఆరాతీశారు. కనిపించడంలేదని గుర్తించి ఈశ్వరుడు కుమారుడు గుండ రవి పంబ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదుకేసిన పోలీసులు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కారు, ఆటో ఢీకొని ఎనిమిది మందికి గాయాలు

పొందూరు: మండలంలోని గారపేట (కృష్ణాపురం) సమీపంలో మంగళవారం సాయంత్రంజరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. చిలకపాలెం నుంచి పొందూరు వైపు వస్తున్న కారు చిలకపాలెం వైపు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. తర్వాత రాజాం నుంచి విశాఖ వస్తున్న గురవాం గ్రామానికి చెందిన కారును కూడా బలంగా ఢీకొట్టింది. దీంతోప్రమాదానికి గురైన కారు డ్రైవర్‌తో పాటు ఆటోలో, విశాఖ వెళ్తున్న కారులో ఉన్న ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. గారపేట గ్రామస్థులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో గాయపడిన వారిని 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రమాద ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేశారు.

పేకాట ఆడుతున్న 28 మందిపై కేసు నమోదు

పాతపట్నం: మండలంలో పలు చోట్ల సంక్రాంతి నేపథ్యంలో పేకాట శిబిరాలపై సోమ, మంగళవారాల్లో పోలీసులు దాడులు చేశారు. సీతారాంపల్లిలో దాడి చేసి 10 మందిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ. 33760స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌యాశిన్ తెలిపారు. అలాగే చిన్నలోగిడిలో రూ.21140 స్వాధీనం చేసుకుని 10 మందిపై, స్థానిక ఉప్పరవీధిలో పేకాట శిబిరంపై దాడులు చేసి రూ.29,480 స్వాధీనం చేసుకుని 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

సరిహద్దు చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ

పాతపట్నం: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేశారు. సీఐ నల్లి సాయి ఆధ్వర్యంలో సిబ్బంది ఒడిశా నుంచి మద్యం, గంజాయి ఖైనీ, గుట్కా వంటి నిషేధిత ఉత్పత్తుల అక్రమ తరలింపును అడ్డుకునేందుకు ఈ తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలతో పాటు బస్సులు, ఇతర వాహనాలను తణిఖీ చేసినట్లు సీఐ తెలిపారు.

థియేటర్ సిబ్బంది నిజాయితీ

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం నగరంలోని ఎస్వీసీ థియేటర్ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. సోమవారం రాత్రి సినిమాకు వచ్చి బంగారం ఆభరణం పోగొట్టుకున్న ప్రేక్షకులకు ఆభరణాన్ని అప్పగించారు. సిబ్బంది, బాధితుల కథనం మేరకు.. శ్రీకాకుళానికి చెందిన మొదలవలస భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులతో ఎస్వీసీ థియేటర్‌లో సోమవారంరాత్రి సినిమాకు వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లిన ఆమె మంగళవారం ఉదయం మెడలో బంగారు ఆభరణం కనిపించకపోవడంతో కంగారుపడి భర్త సహాయంతో అన్ని చోట్ల వెతికారు. చివరకు సినిమా థియేటర్ మేనేజర్ బి.రవి కుమార్‌ను సంప్రదించారు. అప్పటికే థియేటర్‌లో హౌస్‌కీపింగ్ విధులు నిర్వహిస్తున్న దేవికి ఐదు తులాల బంగారు హారం దొరకడంతో మేనేజర్ సమక్షంలో భాగ్యలక్ష్మికి అప్పగించారు. దీంతో సిబ్బంది నిజాయితీని వారు అభినందించారు.


ఆమదాలవలస: తొగరాంలో జాతరకు తరలివచ్చిన భక్తులు


సరుబుజ్జిలి: సోమాలమ్మ జాతరకు తరలివచ్చిన ప్రజలు


పలాస: డేకురుకొండ యాత్రకు తరలి వచ్చిన జనం

అంగరంగ వైభవంగా జాతరలు

- పోటెత్తిన భక్తులు
- స్తంభించిన ట్రాఫిక్
- తప్పని అవస్థలు

కనుమ పురస్కరించుకుని మంగళవారం అంగరంగ వైభవంగా జాతరలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పోటెత్తడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో భక్తులు అవస్థలకు గురయ్యారు.

● **పలాస:** డేకురుకొండ యాత్ర సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినాన ఈ యాత్రను హడ్కో కాలనీ వద్ద ఉన్న డేకురుకొండపై చేపట్టడం ఆనవాయితీ. సంక్రాంతికి వచ్చే కొత్త అల్లుళ్లు, చుట్టాలు, బంధువులు పెద్ద ఎత్తున ఈ యాత్రకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లలు లేని దంపతులు ఈ కొండపై నుంచి జారితే పిల్లలు పుడతారని భక్తుల నమ్మకం. ఈ కొండపై తర్లాకోట జమిందార్లు ఆలయాలు కట్టించినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఈ ఏడాది అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి డేకురుకొండ యాత్రలో పాల్గొన్నారు కనుము సందర్భంగా మంగళవారం సాయంత్రం స్థానిక సీతమ్మతల్లి గుడి వద్ద యాత్రను నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణతో పాటు ఉల్లాసపేట, పలాస ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** మండలంలోని గాజులకొల్లివలస సమీపంలో ఉన్న సంగమయ్యకొండ జాతరకు భక్తులు పోటెత్తారు. కొండపై ఉన్న సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలుచేశారు.సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, బూర్జ, ఆమదాలవలస, శ్రీకాకుళం, గారమండలాలతో పాటు ఆమదాలవలస మునిసిపాలిటీకి చెందిన 50 వేలమంది భక్తులు మంగళవారం జాతరకు హాజరైనట్లు అంచనా వేస్తున్నారు. దీంతో అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయంతో మూడుగంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి రైళ్ల, ప్రైవేటు బస్సులు తప్పిపోయి ఇబ్బందులు పడ్డారు.

● **జి.సిగడాం:** మండలంలోని గెడ్డకంచరాం దేవగప్తాపు సన్యాసిరావు వనంలో వెలసిన పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలతోపాటు గ్రామ పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు వస్తారని ఆలయకమిటీసభ్యులు తెలిపారు.అలాగే సంతవురిటిలో సోమవారం బోనాల పండగను వైభవంగా నిర్వహించారు. గ్రామంలో మహిళలు ముర్రాటలతో పేరంటాలకు బోనాలు సమర్పించారు. సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, గ్రామపెద్దలు బాలబోమ్మ వెంకటశ్వరరావు, బి.సన్యాసిరావు, పిల్లల శివకుమార్, సీహెచ్‌ఆర్‌కే రంగారావు, టి.వెంకటరావు గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వందలాది మంది మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.

●**సరుబుజ్జిలి:** మండలంలోని పెద్దపాలెం సమీపంలో ఉన్న దంతపురి క్షేత్రంలో నిర్వహించిన సోమాలమ్మ తల్లి జాతరకు పెద్దపాలెం, చిన్నపాలెం, పాలవలస, రావివలస, పురుషోత్తపురం, కొండవలస, రొట్టవలస భక్తులు తరలివచ్చారు. ● **ఆమదాలవలస:** మండలంలోని తొగరాంలో వల్లభ నారాయణ స్వామి, వరహా లక్ష్మీనృసింహస్వామి ఆలయాల వద్ద కనుమ రోజు జాతర నిర్వహించారు. గతంలో సంక్రాంతి, కనుమ, ముక్కనుమ మూడు రోజులు యాత్ర నిర్వహించేవారు.


ఆమదాలవలస: సంగమయ్య జాతరలో భక్తులు

● **నరసన్నపేట:** మండలంలో సంతతోటలో శ్రీవేంకటేశ్వరాలయంలో పార్వేట ఉత్సవాన్ని అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. గోదారంగనాథ స్వామి అలక సంబరాలను నిర్వహించి రంగనాథ స్వామి పార్వేట ఉత్సవాన్ని చేపట్టారు. రావాడపేట వద్ద కనకదుర్గ అమ్మవారి 6వ వార్షికోత్సవం సందర్భంగా జాతర చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పారశెల్లిలో జాతర నిర్వహించారు.

● **జలుమూరు:** అబ్బాయిపేట చెరువుగట్టుపై కొలువుదీరిన శ్రీలక్ష్మీ పేరంటాలమ్మకు సంక్రాంతి సందర్భంగా సోమవారం గ్రామస్థులు ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు. మంగళ వాయిద్యాల నడుమ మహిళలు బిందెలతో ఊరేగింపుగా సన్నిధికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో అబ్బాయిపేటతో పాటు కెఎల్ఎస్‌పేట, గంగాధరపేట, జోనంకి గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.


నరసన్నపేట: సంతతోటలో పార్వేట ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


జలుమూరు: ముర్రాటలతో వెళ్తున్న భక్తులు


జి.సిగడాం: సంతవురిటిలో బోనాలు పండగను నిర్వహిస్తున్న గ్రామస్థులు

మంచు దుప్పటి


ఇచ్ఛాపురంలో దట్టంగా కురుస్తున్న మంచు

ఇచ్ఛాపురం: జిల్లాను మంగళవారం ఉదయం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 10గంటల వరకు మంచు తీవ్రత తగ్గలేదు. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉదయం రైల్వే స్టేషన్, ట్రాక్‌లు మంచుతో కప్పుబడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వైభవంగా గోదా రంగనాథ స్వామి కల్యాణం


స్వామివారి తిరువీథి ఉత్సవం

గార: శ్రీకూర్మనాథ స్వామి క్షేత్రంలో మంగళవారం గోదారంగనాథ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈవో జి.గురు నాథరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన అర్చకులు చామర్ల సీతారామనరసింహాచార్యులు నిర్వహించారు.

సనాతన ధర్మం కోసం సైకిల్ యాత్ర


ఆదిత్యుని సన్నిధిలో రాజారాం

శ్రీకాకుళం క్రైం: హిందూ సనాతన ధర్మాన్ని చాటిచెప్పేందుకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు బీహార్‌కు చెందిన పాండే కాశీవిశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని సూర్యనారాయణ స్వామివారిని మంగళవారం సైకిల్ యాత్రికుడు రాజారాం పాండే దర్శించుకున్నారు. ఐదు నెలల కిందట ప్రారంభించిన సైకిల్ యాత్ర ఆదివారం శ్రీకాకుళంలోని అరసవల్లి చేరుకుంది.ఈ మేరకు ఆదిత్యుని దర్శించుకున్న అనంతరం పూరి సైకిల్‌పై పయనమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మాన్ని ప్రచారం చేసేందుకు బీహార్ నుంచి పూండీ వరకు యాత్ర నిర్వహిస్తున్నానని తెలిపారు.

నేటి నుంచి దుర్గాదేవి యాత్ర మహోత్సవాలు

జి.సిగడాం: మండలంలోని మదుపాంలో దుర్గాదేవి అమ్మవారి 13వ వార్షికోత్సవ యాత్రమహోత్సవాలు బుధవారం ప్రారంభంకానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలిరానున్నారు. మూడురోజులపాటు నిర్వహించనున్న యాత్రలో వినోద, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు పాఠశాల విద్యా సంస్కరణలపై వర్క్‌షాపు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఏపీ పాఠశాల విద్యా సంస్కరణలు, ఆవిష్కరణలు, మేధోసంపత్తి హక్కులు అన్న అంశంపై వర్క్‌షాపు బుధవారం నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలితో కలిసి సంయుక్తంగా వర్సిటీ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖలోని ఎన్‌డీఆర్‌సీకి చెందిన సీనియర్ రీజినల్ మేనేజర్ డాక్టర్ బీకే సాహు, డాక్టర్ బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు కీలకోపన్యాసం చేయనున్నారని చెప్పారు.

వాండ్రంగిలో జల్లికట్టు

జి.సిగడాం: వాండ్రంగిలో మంగళవారం కనుమ పురస్కరించుకుని జల్లికట్టు వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామమందిరం నుంచి గ్రామ శివారు వరకు జోడెద్దులతో పోటీలను నిర్వహించారు. ఎద్దులకు ఏరువాక వలే ఏర్పాటు చేసి వాటికి ఉన్న తాళ్ల పట్టుకుని ఎద్దుల వెనుక పరుగులుతీశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి, సర్పంచ్ సాకేటి నాగరాజు, మాజీ సర్పంచ్ బూరాడ వెంకరమణ, ఈసర్ల గోవిందరావు, బాసుమాష్టారు పాల్గొన్నారు.

పొందూరులో కోడేబల్లు

పొందూరు: పొందూరు, లోలుగుల్లో మంగళవారం కోడేబల్లు (ఏడ్ల బళ్ల ప్రదర్శన) నిర్వహించారు. కనుమ పురస్కరించుకుని ఈగ్రామాల్లో కోడేబల్లు నిర్వహిస్తారు. కోడేబల్లు చూడడానికి వేలాదిమంది చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చారు. లోలుగులో జడ్పీటీసీ కాంతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటుచేశారు.

గోరింటలో రంగవల్లుల పోటీలు

పొందూరు: గోరింటలో సంక్రాంతి పురస్కరించుకుని నిర్వహించిన రంగవల్లుల పోటీలను సోమవారం స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్‌నాయకులు, అవినాష్ సావే ఫౌండేషన్ ట్రస్టు ఛైర్మన్ కూన వెంకటరావు నిర్వహించారు.ఈ మేరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కె.శ్రీలేఖ, చింతాడ చంద్రకళ, కె.కల్యాణికు సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, టీడీపీ బీసీసెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ వాసుదేవరావు అందజేశారు.

కుత్తుమ విద్యార్థికి మూడు ఉద్యోగాలు

కంచిలి: కుత్తుమ గ్రామానికి చెందిన శివంగిపరశురాము ఒకే క్యాలెండర్ సంవత్సరంలో మూడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఎస్ఎస్‌సీ నిర్వహించిన పరీక్షలో చెన్నైలో కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా, రాజమండ్రిలో పోస్టల్ అసిస్టెంట్‌గా, ఈపీఎఫ్‌వో 2023 పరీక్షలో సోషల్‌సెక్యూరిటీ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.పేద కుటుంబానికి చెందిన పరశురాము మూడు ఉద్యోగాలకు ఎంపికకావడంతో తల్లిదండ్రులు శివంగి గవరయ్య, పుణ్యావతి దంపతులు గ్రామస్థులు అభినందించారు. కాగా కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగంలో ఈనెల 29న చేరుతున్నట్లు పరశురాం తెలిపారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

బూర్జ: సింగన్నపాలెంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ తులగాపు సుజాత ఒక ప్రకటనలో కోరారు. ప్రతిరోజూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని ట్రాన్స్‌కో అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పండగ పూట కూడా గ్రామంలో విద్యుత్ లేకపోవడం దారుణమని తెలిపారు.

'కాంగ్రెస్‌కు పూర్వ వైభవం'

రణస్థలం: ఏపీ పీసీసీ అధ్యక్ష పదవిని వైఎస్ షర్మిలకు అప్పగించడంతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆ పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గ అధ్యక్షుడు కె.సింహా ద్రినాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షర్మిల ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేస్తామని తెలిపారు.

బెంతు ఒరియాలకు సహకరించండి

కవిటి: బెంతుఒరియా పేరుతో ఉన్న నకిలీలపై చర్యలు తీసుకుని నిజమైన బెంతు ఒరియాలకు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేలా సహకరించాలని బెంతు ఒరియా కులస్థులు కోరారు. మంగళవారం కవిటిలో నిరసన దీక్ష శిబిరం వద్ద విలేకరులతో మాట్లాడారు. నకిలీ బెంతుఒరియాలపై చర్యలుతీసుకోవాలని ఆది వాసీ సంక్షేమపరిషత్ అధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు చేసినవ్యాఖ్యలను సమర్థిస్తున్నామని తెలిపారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బెంతు ఒరియాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు అందించాలని గతంలో ఆర్డీవోకు నివేదిక ఇచ్చామని చెప్పారు. గిరిజనసంక్షేమ శాఖ కార్యదర్శి కూడా బెంతు ఒరియాలు ఉన్నారని నివేదికఇచ్చారని తెలిపారు. నకిలీలపై ఆదివాసీ సంక్షేమపరిషత్ జరిపే పోరాటానికి మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ఇక్కడ 20వ రోజు తమ దీక్షలో యువకులు పాల్గొన్నారు. సమావేశంలో రజనీకు మార్ దొళాయి, సమున్ బిసాయి, బృందావన్ సాహు, మేఘనాద్ బిసాయి, శ్రీకాంత్ దొళాయి, రామారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బెంతు ఒరియా నాయకులు

'శ్రీకాకుళం రోడ్ స్టేషన్'కు ఉత్తమ క్లీన్ స్టేషన్ అవార్డు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వే స్టేషన్ ఉత్తమ క్లీన్ స్టేషన్ అవార్డు కైవసం చేసుకుంది. జోనల్ స్థాయిలో 68వ రైల్వే వారోత్సవాల అవార్డులో మేజర్ స్టేషన్ కేటగిరిలో ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో వాల్తేరు డివిజన్‌లోని ఆమదాలవలస రైల్వేస్టేషన్ 'బెస్ట్ స్టేషన్ ఫర్ క్లీన్లీనెస్ షీల్డ్'గా నిలిచింది. అన్నిరంగాల్లో వాల్తేరుడివిజన్ ద్వారా ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని రైల్వేఅధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌ను రోజువారీగా సుమారు 8,500 మంది ప్రయాణికులు వచ్చే స్టేషన్‌గా నాన్ సబర్బన్ గ్రేడ్ 1 నుంచి 4 కేటగిరీల కింద 2023కు 'క్లీన్‌లీనెస్ షీల్డ్ కోసం ఉత్తమ స్టేషన్‌గా ఎంపికచేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ అవార్డు కింద హౌస్ కీపింగ్, కన్జర్వెన్సీ సిబ్బంది, స్టేషన్ అధికారులకు భారీప్రోత్సాహాన్ని అందించింది. స్టేషన్ మేనేజర్, హెల్త్, కమర్షియల్ సీనియర్ సూపర్‌వైజరీ సిబ్బంది నేతృత్వంలో బృందం స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫారాలు, రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, పార్కింగ్, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని నిర్ధారించి ఎంపికచేశారు. ఈ అవార్డును బుధవారం భువనేశ్వర్‌లో రైల్వే అధికారులు అందుకోనున్నారు.

క్రికెట్ విజేత శ్రీరామవలస

సరుబుజ్జిలి: మండలంలోని సింధువాడలో సంక్రాంతి పురస్కరించుకుని నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు శ్రీరామవలస విజేతగా నిలిచింది. గ్రామానికి చెందిన యువజన సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలినాయుడు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో 48 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.ఈ మేరకు మంగళవారం శ్రీరామవలస, ముసిడికిగట్టు జట్ల మధ్య జరిగిన ఫైనల్‌లో శ్రీరామ వలస విజేతగా, ముసిడికిగట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు టీడీపీ నాయకుడు మీసాల రామారావు ట్రోఫీతో పాటు నగదు బహుమతులు అందించారు.

బంటుపల్లిలో 'స్వచ్ఛత అభియాన్'

రణస్థలం: బంటుపల్లి కోదండరామాలయం ప్రాంగణంలో మంగళవారం విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో యువత స్వచ్ఛత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దైవ కార్యక్రమంలో యువత భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని తెలిపారు.

అప్పన్నమ్మ తల్లి ఆలయంలో పూజలు

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండలంలోని పెద్దపాడు అప్పన్నమ్మతల్లి ఆలయంలో కనుమ పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు చోడిమూడి ఎల్లయ్య పాపాయమ్మ, కలగదండు రామప్పడు కాంతమ్మ దంపతుల ఆధ్వర్యంలో భక్తులు సోమవారం అర్ధరాత్రి నుంచే దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. మహిళలు ముర్రాటలు చెల్లించి, మొక్కులు చెల్లించారు. వంశపారంపర్య అర్చకులు చోడిమూడి అప్పలరామయ్య కలగదండు సింహాచలం, అప్పన్న, శ్రీను, అప్పలసూరిలు అప్పన్నమ్మ తల్లికి పసుపు,కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.రూరల్ ఎస్ఐ విజయకుమార్, ట్రైనీ డీఎస్పీ చప్పిడి రాజాలు అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లుచేశారు.

ఇరుకు రోడ్లు.. భారీ లోడ్లు

- గడ్డిట్రాక్టర్లతో తరచూ ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న అధికారులు


పలాస మండలంలోని మాకన్నపల్లి రోడ్డులో గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు

పలాస రూరల్: ఉద్దానం ప్రాంతంలో ఇరుకు రోడ్ల మీదుగా ట్రాక్టర్లపై భారీ గడ్డి లోడ్లు తరలిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొద్దిరోజులుగా వరి కోతలు అనంతరం జోరుగా నూర్పులు చేస్తుండడంతో భవిష్యత్ అవసరాలు, పశు గ్రాసం కోసం ఎండి వరి గడ్డిని సేకరిస్తున్నారు. కొందరు నిల్వచేసుకోవడానికి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు.

పలాస మండలంలో గ్రామీణ రహదారుల్లో గడ్డి లోడ్లతో వెళ్తున్న ట్రాక్టర్ల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకు రోడ్ల నుంచి భారీ లోడ్లతో ట్రాక్టర్లు వెళ్తుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు వెనుక నుంచి కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రద్దీ సమయంలో ట్రాక్టర్లను నియంత్రించాల్సిన పోలీసులు, అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. ట్రాక్టర్లపై లోడుతో వెళ్తున్న సమయంలో హెచ్చరిక జెండాలు వెనుక వైపు ఉంచాల్సి ఉంది. అయితే ఏ ఒక్కరూ నిబంధనలు పాటించక పోవడంతో వెనక నుంచి వచ్చే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.ప్రధానంగా పశుపోషకులు ఎక్కువగా ఎండి గడ్డిపైనే ఆధార పడుతున్నారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేక పంటలు పండ లేదు. దీంతో అక్కడక్కడ పండినచోట ప్రస్తుతం నూర్పులు జరుగుతున్నాయి. దీంతో ఆదరాబాదరాగా పశుపోషకులు వెళ్లి గడ్డిని సేకరించి నిల్వచేయడానికి తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గడ్డిలోడు వాహనాల వెనుక వైపు హెచ్చరిక జెండాలు ఏర్పాటు చేయాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

పగలు సేకరణ.. రాత్రి తరలింపు

- పౌరసరఫరాల అధికారుల పర్యవేక్షణ కరువు
- ఇదీ పలాస మండలంలో పీడీఎస్ బియ్యం పరిస్థితి

పలాస రూరల్: ప్రభుత్వం పేదలకు ఉచితంగా పీడీఎస్ ద్వారా అందజేస్తున్న బియ్యం దారిమళ్లుతున్నాయి. కొందరు పగలు సేకరించి, రాత్రిపూట గమ్యస్థానాలకు తరలిస్తు న్నారు. ప్రధానంగా ఈ విషయంలో పౌరసరఫరాల అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందన్న విమర్శలొస్తున్నాయి.

పలాస మండలంలో ఉద్దానంతో పాటు గిరిజన, పట్టణప్రాంతాల్లో పీడీఎస్‌బియ్యం టోకు వ్యాపారుల ఆధ్వర్యంలో కొనుగోలు జరుగుతున్నాయి. ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడంతో వారు యథేచ్ఛగా కొనుగోలు చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో కొనుగోలుచేసి ఆటోల ద్వారా తరలించేవారు.అయితే ఆటోల ద్వారా కొనుగోలు కాస్త ప్రమాదంగా మారుతుండడంతో వ్యాపారులు కేవలం ద్విచక్రవాహనాల ద్వారా నాలుగైదు బస్తాలను ఏకంగా తరలిస్తున్నారు. పీడీఎస్ బియ్యంపై ఉద్దాన, గిరిజన ప్రాంతాల్లో సివిల్‌సప్లయ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు వ్యాపారులు కొనుగోలు చేసుకుని తరలిస్తున్నారు. పీడీఎస్ బియ్యం పంపిణీ జరిగిన రెండు రోజుల్లోనే వ్యాపారులు ఆయాప్రాంతాల్లో వాలిపోతున్నారు. పగలంతా సేకరించి రాత్రివేళల్లోసులభంగా గమ్యస్థానాలకు బియ్యం తరలిస్తున్నారు. గతంలో పలాస మండలంలోని సున్నాడలో పీడీఎస్ అక్రమ కొనుగోలు నిల్వలను అధికారులు పట్టుకున్న విషయం విదితమే. తాజాగా ఈ ప్రాంతంలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇటీవల పీడీఎస్ బియ్యం వ్యాపారం ఊపందుకుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి, పీడీఎస్ బియ్యం కొనుగోలు అక్రమంగా జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలుచేసి తరలించడంపై ప్రత్యేక దృష్టిసారించామని, జిల్లా సప్లయ్ అధికారి డి.వెంకటరమణ ఆంధ్రజ్యోతి కి తెలిపారు.


జంటపట్టణాల్లో కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యం (ఫైల్)